### డిశెంబరునెల మంచురోజులు

మార్గశిర పౌర్ణమి దత్త నవరాత్రులు అని  జ్ఞాపకం చేసేవు.
నేను తెలిస్తే ‘ పైయాసి’ ఎవరన్న ప్రశ్న వెంట కూడా వస్తుంది .
ప్రపంచానికి కళ్ళొచ్చాయి. ఆ కళ్ళలో సందేహాలు! సందోహాలు!
ప్రశ్నలతో ఆ కళ్ళు అరుస్తాయి. కూతలు ఘనమవుతున్నాయి.
గుండె చెవులు గళ్ళు పడుతున్నాయి.
కాదంటే మానుతుందా? ఒద్దంటే ఆగుతుందా  దడ!!
సమాధానం ఏమనిచెప్పాలి? ఎలా చెప్పాలి?
నా భావ యంత్రం దృఢంగా బాగానే పని చేస్తోంది.
మారు చెప్పడానికి సమాధాన పడటంలేదు.
ఈ అనుభవం కాయికమా ? మానసికమా?
ప్రపంచానికి కుతూహలం ఎక్కువ!
ఎక్కడేం జరిగినా తెలియాలి. ఎవరికేమైనా కావాలి.
ఇంతకీ నువ్వెవరని చెప్పను? లోకం సంగతి సరే!
ఈ ప్రశ్న నాలోనే పుడితే?
అనుకుంటే కళ్ళకి కనపడే నిన్ను ఎలా బొమ్మలో బంధించను?
‘పైయాసి ’ వ్యక్తా?  కాదు కదా!
నిజంగా మనిషే అయితే పాపం తాను లోకం బేరీజుకి తాళ గలడా?
సమాధానాల కోసం వెదుకుతున్నాను. నిన్ను తలచుకుంటే సమాధానం
దొరికినట్లుంటుంది.
నిన్ను నా తోటి జీవిగా భావించి హాయిగా పిలవగలిగే అదృష్టం మించి ఇంకేం
వద్దనిపిస్తుంది.
నేనూ! నా ఊహా!! వేరు చేసి చూడ లేను!
నేను వేరూ నా ఊహ వేరూ కాదు కనక!
మరి నేను నిన్ను ఊహిస్తున్నాను! అంటే నాలో మెదిలే ఊహ నువ్వన్న మాట!
కానీ ఇక్కడ ‘నువ్వూ’, ‘ఊహా’, ‘నేనూ’ మూడూ ఒకటే!
ఈ త్రిపుటి స్వయం ప్రభ! అది "తపోజ"!
నేను ‘వేది’ ననీ.. నాకు తెలియడమే ‘వేదం’ అనీ, తెలియచేసే శక్తి ‘పైయాసి’ అని ఎలా
చెప్పాలి?

నేను తెలుసు లోకానికి నన్ను చూస్తారు కనుక.
నానడత లర్థమవుతాయి నా నడవడి గమనిస్తారు కనుక!
కంటికి కనిపించని నా శక్తిని చూపేదెలా? చిత్రించేదెలా?
నైరూప్య చిత్రాలకి అర్థాలూ , రూపలూ ఇవ్వడం మొదలెడితే నిరంతర భావ ప్రవాహ
వేగానికి ఆనకట్ట కట్టినవాళ్ళం అవుతాంకద?
'పైయాసి' ని ఎలా పరిచయం చెయ్యాలి? ఏమని పరిచయం చెయ్యాలి?
పేరు పెట్టి పట్టం కట్టి ప్రవర చెప్పడం నా వల్ల కాదే!
జీవితానుబంధానికి దృఢ మైన పునాది ఇది! ఏ పేరు పెట్టను?
'అంటే ఏమిట'ని ఆ పైన ప్రశ్న! నామవాచకాలకి అర్థాలుంటాయా.
అవి వస్తువులకి శబ్ద సంకేతాలని తెలియని పరిస్థితి ఎందుకు వస్తోంది అసలు?
అర్థం ఏమిటి? విషయం తెలియాలి. అర్థం మాటలకందేదా? మనసుకి పట్టేదా?
ప్రతీ 'తెలియడం' ఒక అపురూప అనుభూతి. ప్రతీసారీ ఎంతో ప్రేమ పుడుతుంది.

భక్తి కలదోయి నీయందె ప్రేమ కలదు
వలపు కలదోయి నీపైన ప్రేమ కలదు
చెమ్మ కలదోయి కన్నులను , గుండెకును!
ఇఛ్ఛ కలదోయి ఆరని చెలమ కలదు
కన్ను మూయుట ఎట్లు? కన్ను విప్పుట ఎట్లు?
ప్రేముడిని కన్నులను నీరు వాగై కలదు
ముందుజన్మము లోనొ గత జన్మనోగూడి
ఏనాదొ చిత్తమిది ముడి పడెనొ ఏమొ!
మనసు ఉనికిని నిన్ను పూజించితిని స్వామి
చిత్తముండుట చేసి ఉహించితిని నిన్ను
ఎద కస్సుటను చేసిభక్తి రక్తిని చేర్చి
అత్మైక్యమంద తపమిట్లు చేసితిని !!

ఈ భావనలో ఏ ముందని చెప్పను? నువ్వెవరవని చెప్పను?
ఊహతో పాటు పెడుతున్నావు. ప్రతీ ఆలోచనకీ జతగా!
నాకు తెలిసిందొకటే నిన్ను పాడడం ఊహ్యంగా! గానంగా! సామగా!
నాలో జీవ కణాలెన్ని కోట్లో! అన్నీ ప్రతిధ్వనిస్తాయి.

ఆలోచనల్లో మధ్యపలుకులుండవు!!
లోపల మెత్తన! వెన్న వాకలూ ! వెన్నెల వాగులూ!
మనసుకు కూడా అందని పారవశ్యం ఇది!
తన్మయత్వం! భరోసా! బలం! ధైర్యం!
జీవాగ్ని పురోహితమయే దిక్కడే! ఇప్పుడే!
నువ్వెవరవని చెప్పను? ఎక్కడున్నావని చెప్పను? ఎప్పుడంటే ఎప్పుడని చెప్పను?
నువ్వే నేననీ, నేనే నువ్వనీ ఎలా తెలియ జెయ్యను?
మాటలకి లొంగేదా? అక్షరాల్లో అణిగేదా?
భావోద్విగ్నత బట్టీ ! ఊహల దఘ్నత బట్టీ! కద!
ఎలా సంభావించుకుంటే అలా! వెంపేకానీ వన్నె తరిగేది కాదు!
భక్తి , ప్రపత్తి, అర్పణ అంటూ భాష ఇబ్బంది పెడుతుంది.
అద్వైతులకి కాదు! అంటే నీకూ నాకూ కాదు.
మన మధ్య నున్నది  'శివం'! 'సత్యం' ! 'పరమ సుందరం'!' త్వమేవాహం'!
అదే శివోహం. మన వంటి వాళ్ళు కోట్ల మందున్నారని కోట్ల కోట్ల శివుళ్ళుండరుగా!
శివం అఖండం! బ్రహ్మ భావన అఖండం!
ఇక్కడ పారస్పర్యం నీకూ నాకూ మధ్య.
నువ్వు నువ్వే ఐతే నువ్వని చెప్పగలను! పేరు పెట్టి హాయిగా పిలవగలను.
ఇదొక శక్తి ప్రవాహం. అఖండ ఝురీ ప్రవాహం.
అపరిమిత నిరవరత వేగ ఆవేగ జలపాతం.ఊహకి తోడై వెలుగు మార్గం పట్టించే దివ్వె!

విశ్వ కవి భావనలు వినిపిస్తున్నాయి.
కాలాంచలాలు దాటి విశ్వం వర్షిస్తున్నట్లనిపిస్తోంది.
పాల నురుగులా! ఆహ్లాదంగా! ఆశ్చర్యం! నేనున్నది ఇప్పుడు కదా!
నా యీ ఊహలు ఎప్పుడో పుట్టేయి? నా ఊహ ఎప్పటిది? ఎప్పటి కప్పుడు పరకాయ ప్రవేశం చేస్తోంది!
మళ్ళీ క్రొత్తగా పుడుతోంది. మమకారం చేత మారాకు వేయిస్తోంది.
నాలో  భావ వైభవం అంతా గతంలో వెలిగింది.
నా ఊహలే రేపటి కవి హృదయాల్లో పొంగులెత్తుతాయనిపిస్తోంది.
కాలం అస్తిత్వాన్ని పోగొట్టుకుంటుందేమో! ఊహకా శక్తి ఉంది.
అంటే ఆ శక్తి నీదా! నువ్వే ఆ శక్తివా! అందరిలో ఉంటూ ఒక్కొక్కరికే అందుతావా!

ఈ మహిత శక్తి ' పైయసి' కాక మరేమిటి?
ఈ  కథకి మొదలెక్కడని చెప్పను? జీవ నదులకి మొదలెక్కడ?
హిమాలయాలు చుట్టి రావాలి! మానస సరోవరంలో మునకలు వెయ్యాలి!
పర్వత శిఖర సానువుల్లో పరుగులు పెట్టాలి! అప్పుడు తప్పక  నువ్వేమిటో అర్థమవుతావు!
 జ్ఞాపకం ఉందా? దశాబ్దాలక్రితం. మహారాష్ట్ర పూనా నగర మధ్యం లో 'పర్వతీ' దేవాలయం'.
సంప్రదాయం తెలిస్తే సందేహ సందోహాలన్నీ పటా పంచలవుతాయని ' మేధావి' మాట!
అమ్మవారు ఒంటి నలుగుపిండితో బొమ్మ చేసింది. ప్రాణం పోసింది.
ధర్మం బోధించింది. న్యాయం వివరించి సామర్థ్యం ఇచ్చింది.
ఆ కన్నారి గణధిపతి అయ్యేడు. ఆ గణపతి అంతర్గేహ గణ రక్షణ సేనాపతి కదా!
మనలో గణాలెన్నో! ఎన్ని అక్షౌహిణులో ! నాయకత్వం మనదేగా.
ఇంద్రియాలు! అరిషడ్వర్గాలు! మనస్సు! హృదయం! అన్నిటినీ మించి అహంకారం!
భావాలు! ఊహలు!  ఆలోచనలు!  వర్గాలు చెయ్యక తప్పదు.
పూషాదేవత నాహ్వాలించాలి.  ఈ 'ప్రజ' ని అన్నం పెట్టి పోషించమని ప్రార్ధనలు చెయ్యాలి.
ఎప్పటికప్పుడు నలుగు పెట్టి అఘమర్షణ స్నానం చేయించాలి.
భాషారూపం ఇవ్వాలి. ప్రావీణ్యాపు బట్ట కట్టాలి.
పటిమ అనే జవం అందివ్వలి! సైశిత్యపు నిగారింపు నింపాలి.
'నాది' 'నేను' 'నాకు' అన్న ప్రాణం పరవళ్ళు పెట్టాలి.
వేరే ఊసెందుకు? నియమాలన్నీ పడుగు ముక్కలై పడిపోతాయి.
భావాలన్నీ కాల ప్రవాహ వేగంలో తామరలై తేలుతాయి .
ఏ సుళ్ళలోనూ సురిగిపోవు. ద్రాక్షగుత్తుల్లా అనుభూతికి అందుతాయి.
పైయాసీ! లోపలి లోకమంతా ఊహల వెన్నెల వెలుగు! చిక్కటి రసం.
గతమంతా నేనున్నాను. చరిత్రలో. ప్రతీ పుటలో. ప్రతీ ఒక్కరి ఊహలో.
'నాది' ఏదో ఈ కాల ప్రవాహంలో ఈదుతూ మునకలు వేస్తోంది.
అందరిదీ  ఈ మహా మత్స్యాన్ని పట్టలనే జాలరి మనసే!
గత మంతాప్రవహించి, వర్తమానాన్ని ముంచి, భవిష్యత్తులోకి పొంగులెత్తుతున్న మనసిది.
ఈ సముద్రంలో స్వేఛ్ఛగా ఏదుతున్న ఈ చేపని పట్ట గలదా ఈ మేథ?
'మేధావి' తో నీ వాదన ప్రత్యక్షమవుతోంది.

మహా మత్స్యమా! " ప్రత్యవతిష్ఠంతే" !
అంటున్నావేకానీ ఫరవాలేదు
ఎవరేమనుకున్నా ప్రతిఘటనల బెదిరింపుల
భయం నీకెన్నడుంది కనక!
ఒడ్డుచేరి కొట్టుకోకు మిత్రమా!
ద్వైధీ భావంలో పడ్డావా
కాల సముద్రంలో ఉన్నంతసేపే
మహా మత్స్యానివి కదా !
గట్టునున్నది మూడు గడియల ఆట!
అనుభవించి పారిపోకు
చిదాకాశంలో ఉంటానంటావ్! స్వేచ్ఛగా
సంసార సాగరంలో ఉయ్యాల !
నిన్ను ప్రతిఘటించేదెవరు చెప్పు?
నేను నేను అనేదెవరు? నాది
నాది అనుకునేదెవరు చెప్పు?
నువ్వీదే సముద్రపు లోతెంత?
అంతంచూసే నీ కోరిక చేవంత అవునా?
మనసుని బంధించి లోకం చూడగలవా?
సంపత్తి "స్వప్నం" ! ఆపత్తి "అచ్చం" !
స్వప్నంలో చూసేదంతా కాదంటావా
జాగ్రత్తు తెలిపేదంతా ఔనంటావా!
అర్థంకాలేదంటున్నావు! ఏముందిందులో?
సూర్యుడుండడం "సంపత్తి"! మనం చూసే
ఉదయాస్తమయాలన్నీ "ఆపత్తి" సఖా!
"ఆత్మ" సంపత్తీ "చైతన్యం" ఆపత్తీనూ!
మళ్ళీ చెప్తాను విను! గుళ్ళో
స్వామి వారుండడం "ఆపత్తి" , ఉన్నారని
మనమనుకోడం ఉందిచూసేవా అది " సంపత్తి"
ఇది భావిస్తే అందేదికాదు కదా!
అనుభవానికి మాత్రమే అంకితం !

అందుకనే అంటున్నా! అనుభవించి పరుగొద్దని!!
నీలో శ్వేతకేతుని నిద్ర లేపు ! అమ్మ మాట
ముని మాట ఒకటేగా! నేనన్న స్ఫురణ ఎవరికుంది చెప్పు! ?
చెట్టుకా ? పుట్టకా! నీటికా! గాలికా! నిప్పుకా? పరమాత్మకా!
నాకుంది! నీకుంది! మనలో ప్రాణానికి
అల్పత్వం లేదు !మనలో ఉన్నది "ప్రత్యగాత్మ"
అద్వితీయం! అందుకనే ఈ ఈదులాట!!
ప్రాణానికి ప్రాణి స్వరూపం కదా! ఈ రెండూ
ఒకటెందుకవుతాయి చెప్పు ! సరి! సరి!!
ఒకటి కాదంటావా అను చూస్తా!
ఇందువలన ఆత్మ చైతన్య స్వరూపం!
'ప్రకృతి' చైతన్యానికి స్వరూపం! కదలిక
'ఎదార్థానికి' , చైతన్యం 'తత్వానికి'!
మాటల గారడీ అంటూ వదరకు! నీకున్న ఆస్తి
ఇదొక్కటే ! జాగ్రత్త! నీ మాటల మూటలో
'అసలే' దో 'నకిలీ' ఏదో తెలిసిన నాడే ముక్తి!
తమిగల దాసుడే అసలైన 'జీవుడు'
భావన కందిన సత్యమంతా అను
భవానికి దక్కిన 'ఆపద'అని తెలిసికో!
అసలు కానిది 'ఆత్మ' కానేరదు కదా
ప్రకృతిలో చైతన్యం ఉన్నట్లుందికదా!
'అనిపిస్తోందా' ? 'కనిపిస్తోందా' మిత్రమా!
అనిపిస్తే 'సత్తు'! కనిపిస్తే 'కల్ల'
'అసలేదో' 'నకలేదో' ఈ బొమ్మలాటలో!
సిద్ధాంతం బట్టి కదా యుక్తి ! అది సాధిస్తే
'సిద్ధి' , సాధన వలన విముక్తి శ్వేతకేతూ!!
మనం అద్వితీయులం మహా మత్స్యమా?
కాల గతికి నిశ్చలమై వెలిగే కవి భావన 'పైయాసి' అని ఎలా చెప్పను?...